క్లుప్తంగా

విజేతలకు బహుమతి ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాజశేఖర్

దాబాగార్డెన్స్: రైల్వేన్యూకాలనీ సుబ్బలక్ష్మీ నగర్‌లో వేంచేసిన చింతామణి గణపతి దేవాలయంలో కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిసాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని దండమూడి బాబూరావు సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ అంశాలపై పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల విజేతలకు ఆదివారం ఆలయం వద్ద ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, ఆలయ అధ్యక్షుడు సీవీఎస్ఎల్ రాజు, ఆలయ కమిటీ సభ్యులు, సేవకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

నీలమ్మ వేపచెట్టు అమ్మవారికి పౌర్ణమి పూజలు



నీలమ్మ వేపచెట్టు అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

అల్లిపురం: పంచపౌర్ణమి పూజల్లో భాగంగా భాద్రపద పౌర్ణమి సందర్భంగా ఆదివారం అస్సాం గార్డెన్స్‌లోని నీలమ్మ వేపచెట్టు అమ్మ వారికి విశేష పూజలు, క్షీరాభిషేకం చేశారు. ఆలయ అర్చకుడు జోగారావుశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ముందుగా పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం భక్తులు స్వయంగా అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. ఆషాఢ పౌర్ణమి, శ్రావణ పౌర్ణమి, బాద్రపద పౌర్ణమి, ఆశ్వయుజ పౌర్ణమి, కార్తీక పౌర్ణమి పూజలు ప్రతి ఏడాది నిర్వహించనున్నట్లు అర్చకుడు తెలిపారు.

ఉత్తమ టీచర్లకు సత్కారాలు



ఉత్తమ టీచర్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఉత్తమ ఉపాధ్యాయులు ఇందాన పూర్ణిమ, ఇందాన అనిత, దొడ్డి సంజీవ్‌కుమార్, ఈ. థామస్, పి. విక్రాంత్, దులిపి లక్ష్మి, పాత్రపల్లి సునీల్‌కుమార్ తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ ఊరికి గొప్ప పేరు తీసుకొచ్చిన ఉపాధ్యాయులను సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ వింగ్ రాష్ట్ర నాయకులు వేళంగిణీరావు, పాత్రపల్లి వేళంగిణీరాజు, దాలిబాని మధుకుమార్, గిడుతూరి జాన్, దాలిబాని పర్సి, వాకపల్లి మురళి, కోరాడ శౌరీ, అరసాడ మధు, పాలిక కిషోర్, దేవి, ఈశ్వరి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా పౌర్ణమి తిరువీధి



బేడా మండపంలో స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బంది

సింహాచలం: పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం తిరువీధి వైభవంగా జరిగింది. సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో జరగాల్సిన తిరువీధిని చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం ఆలయ బేడామండపంలో నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో వేంజేపచేశారు. బేడామండపంలో తిరువీధి ఘనంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందించారు. పారాయణాలు చేశారు.

సులువుగా.. సురక్షితంగా..



అల్లిపురం మెయిన్‌రోడ్డులో ఖాళీగా ఉన్న ఏటీఎం సెంటర్



- పెరిగిన డిజిటల్ లావాదేవీలు
- ఏటీఎంలకు తగ్గుతున్న ఆదరణ
- పేమెంట్ యాప్‌ల సేవలపై ఖాతాదారుల సంతృప్తి

అల్లిపురం: ఒకప్పుడు ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్ (ఏటీఎం)లో డబ్బులు తీసుకోవడం ఒక వింత. బ్యాంకుకు వెళ్లకుండా.. విత్‌డ్రా ఫాం గాని, చెక్కుగాని ఇవ్వకుండా చిన్న కార్డుతో మెషీన్ నుంచి డబ్బులు తీసుకోవడం నిజంగా ఒక సాంకేతిక విప్లవం. అప్పుడు అదే గొప్ప. పాతకాలం పోయింది. కొత్త కాలం వచ్చింది. ప్రపంచం డిజిటల్ మయంగా మారింది. ఎక్కడ చూసినా ఆన్‌లైన్ (యూపీఐ) చెల్లింపులే కనిపిస్తున్నాయి. ఇప్పుడు ఏటీఎంలకు కూడా వెళ్లాల్సిన అవసరం లేదు. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే పేమెంట్ అయిపోయినట్టే. ఇదో విప్లవం. ఒక వెలుగు వెలిగిన ఏటీఎంలు ఈసారి వచ్చిన డిజిటల్ విప్లవంతో వెలవెలబోతున్నాయి. ఎక్కడి ఏటీఎంలను చూసినా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో బ్యాంకులు కూడా తమ ఏటీఎంలను క్రమంగా తగ్గించేసుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఒక్క దక్షిణ నియోజకవర్గంలోనే దాదాపు 30 ఏటీఎంలు తగ్గిపోయినట్లు తెలుస్తోంది.

చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా..

జేబులో పర్సు లేకపోయినా, చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా.. చివరకు డెబిట్, క్రెడిట్ కార్డులు కూడా వెంట తీసుకెళ్లకపోయినా.. చేతిలో స్మార్ట్ మొబైల్ ఉంటే పనైపోతోంది. పాల ప్యాకెట్ కొనుగోలు చేసినా, హోటల్‌లో భోజనం చేసినా, సెలూన్లలో మేకోవర్ చేయించుకున్నా.. మార్కెట్‌లో కూరగాయలు మొదలుకొని దుకాణంలో సరుకుల వరకు, అన్నీ డిజిటల్ పేమెంట్‌తోనే కొనేయొచ్చు. దరిమిలా ఏటీఎంల వద్ద డబ్బుల కోసం క్యూ కట్టే పని తప్పిపోయింది.

పేమెంట్ యాప్‌ల హవా..

ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, రేజర్‌పే తదితర థర్డ్ పార్టీ యాప్‌ల సాయంతో జనం ఆన్‌లైన్ లావాదేవీలను సులభంగా చేస్తున్నారు. లక్ష రూపాయల కంటే తక్కువ పరిధిలో సురక్షితమైన చెల్లింపులు జరుగుతుండటంతో వీటికి ఆదారణ లభిస్తోంది. కిరాణా, నిత్యావసరాలు, వాహనాలకు ఇంధనం, మొదలు మొబైల్, డీటీహెచ్ రీచార్జిలు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, రుణాల చెల్లింపులు, నగదు బదిలీ, షాపింగ్, వినోదం తదితర అవసరాలన్నింటికీ ఈ యాప్‌లనే ఉపయోగిస్తున్నారు.

నగదు జమ చేసుకోవడానికే పరిమితం..

ఖాతాదారులు నగదును తమ బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకోవడానికే ఏటీఎంలను ఎక్కువగా ఉపయోగిస్తున్నట్టు బ్యాంకర్లు పేర్కొంటున్నారు. ఖాతాదారులు తమ నగదును జమ చేయడానికి ఆన్‌సైట్ ఏటీఎంలను ఉపయోగిస్తున్నారు. ఆ తరువాత జరిపే లావాదేవీలు మొత్తం ఆన్‌లైన్‌లోనే ఉంటున్నాయి.

తగ్గిపోయిన విత్‌డ్రాలు..



డబ్బు విత్‌డ్రా చేసేవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయినట్టు బ్యాంకర్లు చెబుతున్నారు. డిజిటల్ టెక్నాలజీతో యూపీఐల ద్వారా ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ లావాదేవీలకు అలవాటు పడిపోయారు. దీనివల్ల బ్యాంకులకు ఏటీఎంల నిర్వహణ ఖర్చు పెరిగి పోతోంది. దీంతో బ్యాంకులే ఏటీఎంల సంఖ్యను తగ్గించుకుంటున్నాయి. ఏటీఎంలలో రెండు రకాలుంటాయి. ఒకటి ఆన్‌సైట్ ఏటీఎం కాగా, మరొకటి ఆఫ్‌సైట్ ఏటీఎం. బ్యాంకు ఉన్న ప్రతి చోటా ఏర్పాటు చేసిన ఏటీఎంను ఆన్‌సైట్ అంటారు. బ్యాంకు లేని ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన ఏటీఎంలను ఆఫ్‌సైట్ అంటారు. పెద్ద పెద్ద జంక్షన్లు, షాపింగ్ మాళ్లు వంటి ప్రదేశాల్లో ఇవి ఉంటాయి. ప్రస్తుతం అన్నిచోట్లా డిజిటల్ లావాదేవీలు జరుగుతుండటంతో బ్యాంకులు ఆఫ్‌సైట్ ఏటీఎంలను తగ్గించుకుంటున్నాయి.

డిజిటల్ పేమెంట్‌తో ఈజీ..



డబ్బులు పోతాయన్న భయం లేదు. డబ్బులు వెంట తీసుకెళ్లకపోయినా ఇబ్బంది ఉండటం లేదు. డిజిటల్ పేమెంట్లతో ఎంతో సుఖంగా ఉంది. చిల్లర సమస్య కూడా లేదు. మనకు కావాల్సిన వస్తువును గాని, సేవలను గాని పొందిన తర్వాత క్షణాల్లో పేమెంట్ అయిపోతుంది. సెల్ ఫోన్ చార్జింగ్ ఉండి మొబైల్ డేటా ఉంటే చాలు. ప్రపంచం మన సొంతమైపోయినట్లుగా ఉంటుంది.

– ఎం.వెంకటప్పారావు, అల్లిపురం

సేఫ్ బ్యాంకింగ్ అలవర్చుకోవాలి..

ఖాతాదారులు సేఫ్ బ్యాంకింగ్ అలవర్చుకోవాలి. కొంత మంది నకిలీ వ్యక్తులు బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఓటీపీలు, పిన్ నంబర్లు అడిగితే పొరపాటున కూడా చెప్పొద్దు. అలా అడిగారంటే వెంటనే ఆ కాల్ కట్ చేసి బ్యాంకులో సంప్రదించాలి. నగదు లావాదేవీలు పూర్తిగా తగ్గించి ఆన్‌లైన్ ద్వారా చేసుకోవడం వల్ల చాలా ప్రయోజనాలున్నాయి.

– ఎం.భూదేవి, బ్యాంక్ మేనేజర్

అయిన వారి చెంతకు అభాగ్యులు



భార్యకు దేముడిని అప్పగిస్తున్న శ్రద్ధ ప్రతినిధి

అల్లిపురం: ఇంట్లో గొడవలతో మానసిక ఆరోగ్యం దెబ్బతిని విజయనగరం జిల్లా, బొండపల్లి మండలం, బుడతనాపల్లి రాజేరు గ్రామానికి చెందిన దేముడు నాలుగు నెలల క్రితం విశాఖ చేరుకున్నాడు. అతన్ని ఏయూటీడీ సిబ్బంది గుర్తించి ఆశ్రయం కల్పించారు. చికిత్స తర్వాత అతని ఆరోగ్యం మెరుగుపడింది. దీంతో అతని నుంచి వివరాలు సేకరించారు. చిన్నప్పుడే దేముడు తల్లి, రెండు సంవత్సరాల క్రితం తండ్రి చనిపోయారు. పదేళ్ల క్రితం బాగా మద్యం సేవించేవాడు. భార్య మాన్పించేసింది. తండ్రి మరణంతో మానసిక ఆరోగ్యం దెబ్బతింది. రోజూ భార్యతో గొడవ పడటంతో పాటు పనికెళ్లడం మానేశాడు. దేముడి భార్య సూరమ్మ వివరాలు తెలుసుకుని దేముడిని షెల్టర్ హోం నిర్వాహకులు కుటుంబానికి అప్పగించారు.

కుటుంబ సభ్యులకు వృద్ధుడి అప్పగింత..



వృద్ధుడిని రెస్క్యూ చేసిన మహారాణిపేట సీఐ యాదవ్

కుటుంబ గొడవల కారణంగా వృద్ధుడు మనస్తాపం చెంది ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఈ మేరకు అతని కుటుంబ సభ్యులు మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. స్పందించిన మహారాణిపేట సీఐ యాదవ్ తన సిబ్బందిని ఏర్పాటు చేసి గాలించగా మత్స్యదర్శిని ఎదురుగా గల బీచ్‌లో అతని ఆచూకీ కనిపెట్టారు. ఫిర్యాదు తీసుకున్న సుమారు 15 నిమిషాలలోనే వృద్ధుడిని అతని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

గణపతి చెంత మహాన్నదానం



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న వాసుపల్లి, కార్పొరేటర్ పద్మారెడ్డి

దాబాగార్డెన్స్: నియోజకవర్గ పరిధి వినాయకనగర్‌లో ఆదివారం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వినాయక యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీవిశాలక్షి అంబికా విశ్వనాథేశ్వరస్వామి మహాగణపతి దేవాలయంలో వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్థాయీ సంఘం సభ్యురాలు సాడి పద్మారెడ్డితో కలిసి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ మహాన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ స్వామి అన్న ప్రసాద వితరణలో విభిన్న రీతిలో వంటకాలు వండి 5 వేల మందికి పైగా భక్తులకు ప్రసాద వితరణ చేయడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ప్రతి ఏటా వినాయక చవితి ఉత్సవాలు ఇలానే ఘనంగా జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌తో పాటు 27వ వార్డు పార్టీ అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, సౌత్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకుల శ్యామ్, పిల్లి అజయ్‌రెడ్డి, పార్టీ నాయకులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



ఉచిత శిబిరంలో దంత పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

అల్లిపురం: నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని జీవీఎంసీ 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. ఫోర్ డిస్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అల్లిపురం శిష్టకరణ కమ్యూనిటీ హాల్లో ఆదివారం జరిగిన ఉచిత దంత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ముఖ్య అతిథి గా ఆయన విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విశాఖపట్నం జిల్లా శిష్టకరణ సంఘం అధ్యక్షుడు ఎస్.ఎన్.కె.మహంతి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న ఫోర్ డిస్ డెంటల్ హాస్పిటల్ సేవలను కొనియాడారు. డాక్టర్లు అజిత్, అనూష పట్నాయక్ వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, ఉచితంగా పేస్టులు, మౌత్ వాష్‌లు పంపిణీ చేసి, దంత సంరక్షణపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిష్టకరణ సంఘం కోశాధికారి డి.హరనాథ్, ప్రతినిధులు మంత్రి శాలివాహన్, పక్కి బాలాజీ విఠల్, పక్కి నరసింహారావు, కుప్పిలి ఆనందరావు, భీమేశ్వరరావు, జయతి ఉమామహేశ్వరరావు, ఫోర్ డిస్ డెంటల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ సుధాకర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న ఫిజియోథెరపీ వైద్యులు, విద్యార్థులు

దాబాగార్డెన్స్: ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా ఫిజియో థెరపీ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం ప్రతినిధుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, వ్యాఘ్రేశ్వరుడు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ మెడిసిన్ అండ్ రీహాబిలిటేషన్ (ఫిజియోథెరపీ కాలేజీ) ప్రిన్సిపాల్ సెంథిల్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రధాన ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో ఫిజియో వైద్యులు, వివిధ కాలేజీల విద్యార్థులు సుమారు 150 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జనరల్ బాడీని కండక్ట్ చేసి తదనంతర కమిటీకి ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు.

కుప్పలుగా వినాయక పూజా సామగ్రి



జోడుగుళ్లపాలెం వద్ద ఒడ్డుకు చేరిన వినాయక ప్రతిమల తొలగింపును పరిశీలిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి



జోడుగుళ్లపాలెం వద్ద కుప్పలుగా చేరిన వినాయక పూజా సామగ్రి, బొమ్మలకు ఉపయోగించిన కర్రలు, గడ్డి

ఆరిలోవ : వినాయక నవరాత్రి మహోత్సవాలు నగరంలో ఘనంగా ముగిశాయి. శనివారం రాత్రి సముద్ర తీరంలో నిమజ్జనాలు జరిగాయి. ఇందులో భాగంగా జోడుగుళ్లపాలెం తీరం వద్ద నిమజ్జనం చేసిన వినాయక ప్రతిమలు మట్టితో చేసినవి నీటిలో కరిగిపోగా, ఇతర వస్తువులతో తయారు చేసినవి, మట్టి ప్రతిమలపై దట్టంగా వేసిన రంగుల కారణంగా కరగనివి ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. వాటితో పాటు పెద్ద బొమ్మలు కరిగిపోగా వాటిని తయారు చేసేటప్పుడు వినియోగించే కర్రలు, గడ్డి, గూళ్ల మాదిరిగా సముద్ర కెరటాలకు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. వాటిని ఆదివారం తొమ్మిదో వార్డు పారిశుధ్య కార్మికులు సేకరించి కుప్పలుగా వేశారు. జోడుగుళ్లపాలెం తీరాన్ని సందర్శించిన జోన్ – 2 కమిషనర్ కనకమహాలక్ష్మి వాటిని పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీతో మాట్లాడి పారిశుధ్య కార్మికులతో డంపింగ్‌యార్డుకు తరలించారు. కుప్పలుగా పడిన ఈ సామగ్రిని కార్మికులు లారీలతో తరలించాల్సి వచ్చింది. గంగలో కరగని వినాయక ప్రతిమలు తిరిగి డంపింగ్ యార్డులోని చెత్త కుప్పల్లో కలపాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో పూర్తి స్థాయిలో మట్టి ప్రతిమలనే వినియోగించాలని కోరుతున్నారు.

అంతటా నిర్మానుష్యం

- గణేష్ ఉత్సవాలు.. నిమజ్జనాల అనంతరం అలసిపోయిన యువత
- గ్రహణం ప్రభావమూ కారణమే



నిర్మానుష్యంగా కాన్వెంట్ జంక్షన్



పోర్టు రోడ్డు ఇలా..



టౌన్ కొత్తరోడ్డు ఇలా..



కురుపాం మార్కెట్ రోడ్డు ఇలా..

దాబాగార్డెన్స్: నియోజకవర్గం ఆదివారం నిర్మానుష్యంగా మారింది. జనసంచారం లేక రోడ్లన్నీ వెలవెలబోయాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అడపా దడపా జనం కనిపించినా.. మధ్యాహ్నం తర్వాత ఆ పరిస్థితి ఎక్కడా కనిపించలేదు. చంద్రగ్రహణం కారణంగా నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను శనివారం నిమజ్జనం చేశారు. నిమజ్జన ఊరేగింపులు శనివారం అర్ధరాత్రి దాటి ఆదివారం వేకువజాము వరకు జరగడంతో నిమజ్జనాల్లో మునిగి తేలిన యువత ఆదివారం సాయంత్రం వరకు ఇంటికే పరిమితమయ్యారు. దుకాణాలు కూడా పెద్దగా తెరుచుకోలేదు. దీంతో రోడ్లన్నీ బోసిపోయాయి. జగదాంబ జంక్షన్ తప్ప.. పూర్ణామార్కెట్, టౌన్ కొత్తరోడ్డు, రీడింగ్‌రూమ్ ఏరియా, పోర్టు ఏరియా, డాబాగార్డెన్స్, రామకృష్ణా రైతు మార్కెట్ జంక్షన్, రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు, వెలంపేట, 75 ఫీట్‌రోడ్డు తదితర జంక్షన్లు, ప్రధాన రోడ్లు వెలవెలబోయాయి. చంద్రగ్రహణం కారణంగా ఆలయాలు తెరవకపోవడంతో ఆలయాలకు వెళ్లే భక్తులు కూడా ఎక్కడా కనిపించలేదు.

ఆదిత్యునికి అభిషేకాలు



సుజాతానగర్‌లో పూజలందుకుంటున్న సూర్యనారాయణస్వామి

పెందుర్తి: సుజాతానగర్‌లోని సూర్యనారాయణస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామివారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. స్వామిని అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

నేడు అప్రంటిస్‌షిప్ మేళా

కంచరపాలెం: పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో కోర్సులు పూర్తి చేసి అప్రెంటిస్ చేయని అభ్యర్థుల కోసం కంచరపాలెంలోని విశాఖ ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ఆవరణలో సోమవారం ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా–2025 నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, జోన్–1 ఉప సంచాలకుడు ఆర్ వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే, హిందుస్తాన్ షిప్‌యార్డ్, ఆలిండియా రేడియో, మేధా సర్వో డ్రైవ్స్, జయభేరి లిమిటెడ్ కంపెనీలతోపాటు 12కి పైగా ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు బయోడేటా, ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలకు ఎన్‌టీఏ కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

పెందుర్తి: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. స్థానిక మహిళా ప్రగతి కేంద్రంలో ఆదివారం ఎన్‌టీఏ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న విద్యా సంస్కరణలకు ఉపాధ్యాయులు పూర్తి సహకారం అందించాలన్నారు. పలు అంశాలపై చర్చించారు. ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి హైమారావు, ఆర్థిక కార్యదర్శి శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

చంద్ర గ్రహణంతో ఆలయాల మూసివేత



బల్లిగిరి దేవస్థానంలో కవాట బంధనం చేస్తున్న ఆలయ అర్చకుడు



శివరామకృష్ణ దేవస్థానంలో..



గ్రహణం సందర్భంగా మూసివేసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం

అల్లిపురం: చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలో పలు ఆలయాలు ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి మూసివేశారు. వెంకటేశ్వరమెట్టపై గల వేంకటేశ్వరస్వామి దేవస్థానం, అస్సాంగార్డెన్స్‌లో గల నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం, శివరామకృష్ణ దేవస్థానం, డీబీకే రైల్వే క్వార్టర్స్‌లో గల భవానీ శంకర దేవాలయం మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం విశేష అభిషేకాలు చేపట్టిన తర్వాత భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్లు ఆలయాల అర్చకులు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు ప్రభుత్వం కుట్ర



రామకృష్ణాపురంలో పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గాజువాకలో ఈ నెల 11న నిర్వహించనున్న సీపీఎం బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు ఆదివారం పాదయాత్ర చేపట్టారు. జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురంలో చేపట్టిన పాదయాత్రలో సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత ఆ హామీని పక్కన పెట్టేశారని విమర్శించారు. కూటమి నాయకులు ప్రధానమంత్రి మోదీపై ఒత్తిడి తీసుకొచ్చి స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా ప్రయత్నించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా అడ్డుకోవడానికి గాజువాకలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలంతా సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నరేంద్రకుమార్, రత్నం, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.